


# ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 10-8-2019 శనివారం సిటీ సంపుటి 46 సంచిక 1
రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



## మహానటి కి జాతీయ కీర్తి

- ఉత్తమ నటి కీర్తి సురేష్
- ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా మహానటి
- వెలుగులీనిన తెలుగు సినిమా
- 7 జాతీయ పురస్కారాలు సొంతం
- ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా సుధాకర్‌రెడ్డి యక్కంటి

...పూర్తి వివరాలు 2, సినిమా పేజీల్లో

ఉత్తమ నటులు



ఆయుష్మాన్ ఖురానా  విక్కీ కౌశల్

## అయిననూ వడ్డీంచారు

**25 లక్షల మంది రైతుల నుంచి రూ.780 కోట్లు కట్టించుకున్న బ్యాంకులు**

- 'వడ్డీ లేని రుణాలు' పథకం అమల్లో ఉన్నా భేఖాతరు
- సర్కారు ఇస్తే తిరిగి రైతుల ఖాతాల్లో వేస్తామంటున్న బ్యాంకులు
- ఖరీఫ్ రుణాల పంపిణీలోనూ నత్తనడక

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వడ్డీ లేని పంట రుణాల (వీఎల్ఆర్) పథకం అమల్లో ఉన్నా.. బ్యాంకులు రైతుల ముక్కు పిండి వడ్డీ వసూలు చేస్తున్నాయి. ఈ పథకం కింద గత రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని, రైతుల నుంచే వడ్డీ వసూలు చేస్తున్నామని బ్యాంకులు చెబుతున్నాయి. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం వడ్డీతో సహా పాత బకాయి చెల్లించిన రైతులకే కొత్త పంట రుణం ఇవ్వాల్సి ఉందని స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటివరకూ దాదాపు 25 లక్షల మంది రైతుల నుంచి రూ.780 కోట్లు వసూలు చేసినట్లు వ్యవసాయ శాఖకు బ్యాంకులు తాజాగా నివేదిక ఇచ్చాయి. ప్రభుత్వం ఈ నిధులు ఇస్తే తిరిగి రైతుల ఖాతాలో జమ చేస్తామని తెలిపాయి. ఈ పథకం కింద బకాయిల చెల్లింపునకు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.256 కోట్ల విడుదలకు గత మే 31న పరిపాలన అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చారు. ...మిగతా 2లో

### రూ.27 వేలు వసూలు చేశారు

– జగదీశ్‌రెడ్డి, పత్తి రైతు, జైనథ్, ఆదిలాబాద్ జిల్లా

గతేడాది పత్తి సాగుకు బ్యాంకులో రూ.1.85 లక్షల పంట రుణం తీసుకున్నా. కొత్త రుణం ఇచ్చేముందు పాత బకాయి కింద రూ.2.12 లక్షలు వసూలు చేశారు. వడ్డీ కింద రూ.27 వేలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం వీఎల్ఆర్ పథకం కింద నిధులు విడుదల చేస్తే ఆ సొమ్ము తిరిగి నా ఖాతాలో వేస్తామన్నారు. గతేడాది కూడా ఇలాగే వడ్డీ వసూలు చేశారు.

### ఆరోగ్య పథకానికి

## ఉద్యోగుల భాగస్వామ్యం

- నెలకు రూ.600-1000 వరకూ చెల్లింపులకు సిద్ధం
- వైద్యమంత్రికి ఉద్యోగ సంఘాల వినతి

14లో



## మల్లన్న సిగ నుంచి దూకింది కృష్ణమ్మ

శ్రీశైలం జలాశయం గేట్ల ఎత్తివేత 5లో



## కాంగ్రెస్ అధ్యక్షునిగా ముకుల్ వాస్నిక్?

- నేడు సీడబ్ల్యూసీ భేటీ 11లో

## జైట్లీకి తీవ్ర అస్వస్థత



- ఎయిమ్స్ ఐసీయూలో చికిత్స
- నిలకడగా ఆరోగ్యం
- ఆసుపత్రికి వచ్చిన ప్రధాని, కేంద్ర మంత్రులు

2లో



రాంపూర్‌లో వెట్ రన్‌కు సిద్ధంగా పంపుహౌస్



ముప్కాల్ వద్ద నిర్మాణంలో ఉన్న పునరుజ్జీవ పంపుహౌస్

## శ్రీరాంసాగర్‌కు కాళేశ్వరం జలాలు

- వారంలో నీటి తరలింపునకు ఏర్పాట్లు
- 'పునరుజ్జీవానికి' శంకుస్థాపన జరిగి రెండేళ్లు

ఈనాడు, నిజామాబాద్: ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ 'పునరుజ్జీవ కల' త్వరలోనే సాకారం కాబోతోంది. 9.6 లక్షల ఎకరాల ఆయకట్టు గల శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకానికి 2017 ఆగస్టు 10న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. వారం రోజుల్లో కాళేశ్వరం నీటిని తీసుకొస్తామని ఇంజినీర్లు చెబుతున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఏమిటీ పథకం..**

కాళేశ్వరం జలాలను రివర్స్ పంపింగ్ ద్వారా ఏటా 60 టీఎంసీలు శ్రీరాంసాగర్‌లోకి తరలించాలనేది పునరుజ్జీవ పథకం లక్ష్యం. ఇందుకోసం మూడుచోట్ల పంపుహౌస్‌లు నిర్మించారు. వీటిల్లో ఒక్కోటి 6.5 మెగావాట్ల సామర్థ్యం గల ఎనిమిదేసి మోటార్లు బిగిస్తున్నారు.

**వారం రోజుల్లో జలాలు..**

ముప్కాల్ పంపుహౌస్ పూర్తవనప్పటికీ రాంపూర్, రాజేశ్వరరావుపేట పంపుహౌస్‌లు నడిస్తే రివర్స్ గ్రావిటీ ద్వారా 54 టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి వస్తుందని ఇంజినీర్లు చెబుతున్నారు. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా.. 54 టీఎంసీలు గ్రావిటీ ద్వారా తరలించొచ్చని పేర్కొంటున్నారు. '0' పాయింట్ వద్ద ...మిగతా 2లో

### ప్రారంభానికి సీఎం రాక..

రెండు పంపుహౌస్‌లు పూర్తయి ఎస్సారెస్పీ వరకు నీటిని తీసుకెళ్లే వెసులుబాటు ఉండటంతో పథకం ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో పదో తేదీనే కార్యక్రమం నిర్వహించాలని భావించినా.. వర్షాలతో పంపుహౌస్‌ల వద్ద కొంత అసౌకర్యం ఏర్పడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 15వ తేదీలోపు ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని అధికారులు అంటున్నారు.

## ఇదీ సంగతి!




ఓకే, లక్షణంగా పెళ్లి చేసుకోండి. కాని జీవితంలో ఎప్పుడూ పరస్పరం గొడవలకు దిగొద్దు!

## కలల కుటుంబంలో కారు చీకట్లు

**తీర్థ యాత్రలో విషాదం**

### ఒకే కుటుంబంలోని ఆరుగురి దుర్మరణం

- ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- మృతులు కరీంనగర్ వాసులు
- రైలులో తిరుమలకు వెళ్లాల్సిన కుటుంబాలు
- చివరి నిమిషంలో నిర్ణయం మార్పు
- ఉసురు తీసిన కారు ప్రయాణం

2లో



మల్లేశ్వరరావు



వంశీ



అర్చన





చిన్నారులు క్రిషన్, అద్వైత్



# ఈనాడు సినిమా



సావిత్రి గారికీ నాకూ కొన్ని పోలికలున్నాయి. కొన్ని విషయాల్లో ఇద్దరి ఆలోచనలూ ఒకేలా ఉంటాయి. అందుకే ఈ పాత్ర నాకు వచ్చిందేమో అనిపించింది. సినిమా చేస్తున్నప్పుడు 'ఇది వరకెప్పుడూ చేయని పాత్ర, ఇంకెప్పుడూ చేయలేని పాత్ర నా దగ్గరకు వచ్చింది' అనుకుంటూనే పని చేసేదాన్ని. జీవిత కాలంలో ఒక్కసారి వచ్చే అదృష్టం, అవకాశం అంటారు కదా, అలాంటి పాత్ర ఇది. ఈ అవార్డుని మా అమ్మకే అంకితం ఇస్తున్నా.

– కీర్తి సురేష్

# అభినయ కీర్తి పతాక



కీర్తి సురేష్

అతని వయసు కేవలం ఒక్క సినిమా. పది మాటలు మాట్లాడితే... అందులో సగం ఇంగ్లిష్ ముక్కలే. బిడియమో, వినయమో తెలియని వ్యక్తిత్వం. ఓ మహానటి కథని సినిమాగా తీయాలని సంకల్పించాడు. ఆ నటి సావిత్రి... ఆ దర్శకుడు నాగ అశ్విన్.

సావిత్రి గురించి తెలియని కొత్త విషయాలేమున్నాయి?

ఆమె జీవితంలోని చీకటి కోణాల్నీ నిజాయతీగా తెరపై చూపించగలడా?

అసలు ఈ సమయంలో ఇలాంటి కథ చెప్పడం అవసరమా? ఇలా ఎన్నో ప్రశ్నలు. కానీ నాగ అశ్విన్ ఇవేం పట్టించుకోలేదు. సావిత్రి జీవితం మొత్తం తెలుసుకున్నాడు. సావిత్రి పాత్రకు ఎవరిని ఎంచుకోవాలో తెలీక... సతమతమవుతున్నప్పుడు నాగ అశ్విన్ ఓ తమిళ చిత్రం చూశాడు. పేరు... 'తొడరి'. అందులో ఓ అమ్మాయి. 14 ఏళ్లు నిండని పాపాయిలా అందంగా, అమాయకంగా కనిపించింది. మేకప్ వేయకుండానే ఓ వెలుగు చూశాడు ఆమెలో.

'తనే నా సావిత్రి' అని ఫిక్సయిపోయాడు. నాగ అశ్విన్ చూసిన నేటి సావిత్రి.. 'కీర్తి సురేష్'.

సావిత్రి కథని నాగ అశ్విన్ తీయాలనుకున్నప్పుడు సినీ పరిశ్రమ ఎంత ఆశ్చర్యపోయిందో..

సావిత్రి పాత్రకు కీర్తి సురేష్‌ని ఎంచుకున్నప్పుడూ అంతకు మించే షాకైంది.

అప్పటికి కీర్తి సురేష్ చేసింది ఒక్క సినిమానే. అదీ ఓ లవ్ స్టోరీ. సావిత్రి అంతటి మహానటి పాత్రని పోషించే వయసు, అర్హత... కీర్తికి ఉన్నాయా?

నిత్యమేనన్‌ని తీసుకోవచ్చుగా, విద్యాబాలన్ అయితే హిందీ మార్కెట్ కూడా ఉంటుందిగా..

ఇలా ఎన్నో సలహాలు, ప్రశ్నలు. వాటన్నింటినీ పక్కన పెట్టి కీర్తిని ఎంచుకున్నాడు నాగ అశ్విన్.

అవకాశం రాగానే కీర్తి ఏమీ ఆలోచించలేదు. 'నన్ను దర్శకుడు నమ్మారు.. నేను దర్శకుణ్ని నమ్మాలి' అని నిర్ణయించుకుంది. సినిమా విడుదలయ్యాక అన్ని ప్రశ్నలకూ సమాధానం దొరికేసింది. డబ్బులతో పాటు బోలెడన్ని అవార్డులు. ఇప్పుడు కీర్తి సురేష్‌కి జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా పురస్కారం. ఇదే చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఘనత. కాస్ట్యూమ్స్ విభాగంలో మరో అవార్డు అందుకుని... జాతీయ స్థాయిలోనూ తెలుగు సినిమా కీర్తి పతాక ఎగరేసింది... 'మహానటి'.

అయితే సావిత్రిగా రూపాంతరం చెందడం వెనుక కీర్తి చాలా కృషి చేసింది. సావిత్రికి సంబంధించిన పుస్తకాలన్నీ ముందేసుకుని ఆమెను ఆవాహన చేసుకోవడం మొదలుపెట్టింది. కానీ.. లోపల ఎక్కడో అనుమానం.. భయం. సావిత్రిలా నేను కనిపిస్తానా? నేను మెప్పిస్తానా? అనే ఆలోచనలు నిద్రపట్టకుండా చేశాయి. "తొలి రోజు షూటింగ్ నాకింకా గుర్తుంది. సావిత్రికి సంబంధించిన పాటల్ని మెడ్లీగా తీశారు. ఆ పాటల్లో సావిత్రి ఎలా ఉన్నారో అలాంటి మేకప్ వేసుకోవాలి. సెట్స్ కూడా అచ్చంగా అలానే ఉండాలి. ఒకొక్కరి చేతిలో ఒక్కో సెల్‌ఫోన్. యూ ట్యూబ్‌లో పాత పాటల్ని చూస్తూ.. ఎక్కడైనా కొంచెం తేడా కనిపించినా.. నా దగ్గరకు వచ్చి 'అక్కడ ఇలా లేదు కదా' అంటూ అడ్డుకునేవారు" అంటూ 'మహానటి' తొలి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకొంది నేటి 'మహానటి' కీర్తి సురేష్.

సావిత్రి పాత్ర దక్కడం వరం. తేడా వస్తే అదే శాపం. 'మంచి పాత్రని పాడు చేశావ్' అనే అపవాదు మూటగట్టుకోవాలి. కానీ.. కీర్తి సాహసం చేసింది. "నిజంగా అది సాహసమే. కాకపోతే.. నా భయాలు నాకున్నాయి. ఆ పాత్ర నేను మోయగలనా? లేదా? అని పదే పదే ప్రశ్నించుకునే దాన్ని. కొన్నిసార్లు నేను సావిత్రి గారిని ఇమిటేట్ చేస్తున్నానేమో అనే భయం కూడా కలిగేది. సీన్ అవ్వగానే మానిటర్ దగ్గరకు పరుగులు పెట్టేదాన్ని. అందులో నన్ను నేను చూసుకునేంత వరకూ ఆ భయం వెంటాడేది" అని ఆ రోజుల్ని గుర్తు చేసుకుంది కీర్తి.

సావిత్రి జీవితంలోని అనేక దశల్ని రెండున్నర గంటల్లో చూపించాలి. దర్శకుడికే కాదు, ఆ పాత్ర పోషిస్తున్న నాయికకీ అది పెద్ద పనే. కొన్ని సన్నివేశాల్లో బొద్దుగా ఉన్న సావిత్రిని చూపించాల్సి వచ్చింది. అప్పుడు కీర్తి శారీరకంగానూ కష్టపడింది. 'పద్నాలుగేళ్ల అమ్మాయిగా కనిపించడం కష్టమనిపించలేదు. చివరి దశ బాగా ఇబ్బంది పెట్టింది. బుగ్గలు రావడం కోసం నోట్లో దూదె పెట్టుకున్నాను. నోట్లో దూది ఉండగా డైలాగులు చెప్పడం కష్టం అనిపించింది. 'మహానటి' డబ్బింగ్ సమయంలో ప్రతి పదం.. ప్రతి అక్షరం శ్రద్ధగా పలికాను. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నాను కాబట్టే.. ఈ పాత్రకు మంచి పేరొచ్చింది" అంటోంది కీర్తి.

> బ్లాక్ అండ్ వైట్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. మిస్సమ్మ, మాయాబజార్, గుండమ్మ కథ, పాతాళ భైరవి.. ఇలా ఎన్నో అద్భుతాలున్నాయి. ఆ శకంలో వచ్చిన సినిమాల్ని చాలా చాలా ప్రేమించాను. అందుకే ఆ శకాన్ని వెండి తెరపై చూపించాలి అనుకున్నా. అక్కడి నుంచి 'మహానటి' ఆలోచన పుట్టింది. దేశంలో చాలా మంది గొప్ప నటీమణులున్నారు. సావిత్రిగారికంటే మంచి నటులున్నారు. కానీ వాళ్లు వేరు. సావిత్రి గారు వేరు. ఎవరికీ దక్కని స్టార్ డమ్ ఆమెది. మహారాణిలా బతికారు. చివర్లో కష్టాలు అనుభవించారు. ఆమె కథ ఈ తరానికి చెప్పాలనిపించింది. అలా 'మహానటి' ఆవిర్భవించింది.
>
> – నాగ అశ్విన్

ఓ సినిమాకి పనిచేస్తూ, ఆ పాత్రలో లీనమైపోవడం, చిత్రబృందంతో విడదీయలేని అనుబంధం ఏర్పరచుకోవడం అరుదుగా జరిగే విషయాలు. 'మహానటి' విషయంలో ఇవన్నీ జరిగాయి. సావిత్రి జీవితంలోని విషాదాన్నీ, విజయాన్నీ.. తన మనసులోతుల్లోకి తీసుకోగలిగింది కీర్తి. చివరి రోజు.. ఆ సెట్‌ని వీడిపోతూ.. కన్నీరు మున్నీరైంది. తనతో పాటు పనిచేసిన టీమ్ అందరికీ చిన్న చిన్న కానుకలు ఇచ్చి సెలవు తీసుకుంది. అప్పుడే అనిపించింది. ఈ సినిమాలో, ఆ పాత్రలో ఏదో మ్యాజిక్ ఉందని. ఇప్పుడు జాతీయ అవార్డులతో ఆ మ్యాజిక్ ఏమిటన్నది అర్థమైంది.



'సరిలేరు నీకెవ్వరు'లో మహేష్‌బాబు

# అందం అంటే మేకప్ కాదు

వన్నె తరగని అందం కాజల్ సొంతం. అందంతో పాటు అభినయంలోనూ తనకి తిరుగులేదని చాలా చిత్రాలతో చాటి చెప్పారు. ఇటీవల శర్వానంద్‌తో కలిసి 'రణరంగం'లో నటించారు. ఆ చిత్రం 15న వస్తోంది. ఈ సందర్భంగా కాజల్ శుక్రవారం విలేకర్లతో చెప్పిన విషయాలివీ...

**'రణరంగం'లో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

ద్వితీయార్ధంలో వచ్చే పాత్ర నాది. నేనొక వైద్యురాలిగా కనిపిస్తానంతే. కథానాయకుడు, నేను ఒకరికొకరు ఎలా సాయం చేసుకొన్నామన్నది ఆసక్తికరం.

**'సీత' ఫలితం నిరుత్సాహపరిచిందా?**

అందులో నా నటన, పాత్ర విషయంలో ఇప్పటికీ సంతోషంగా ఉన్నా. కానీ ఆశించిన ఫలితం రాలేదు. మళ్లీ అలాంటి పాత్రలు వస్తే చేయడానికి సిద్ధమే.

**ఆ మధ్య మేకప్ లేకుండా తీయించుకొన్న మీ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టడానికి కారణం?**

ఒక బలమైన సందేశం ఇచ్చేందుకే ఆ ఫొటో షూట్ చేశా. అందం అంటే మేకప్ అనే భ్రమలోకి వచ్చేశారు చాలా మంది. సామాజిక అనుసంధాన వేదికలు అందుబాటులోకి వచ్చాక చాలామంది ముస్తాబై ఫొటోలు తీసుకోవడం, పోస్ట్ చేయడమే పనిగా పెట్టుకొన్నారు. అందం అంటే మనలా మనం కనిపిస్తూనే, ఆత్మవిశ్వాసంతో మెలగడమే అన్నది నా నమ్మకం.

**మీరు నటించిన 'అ!' దర్శకుడు ప్రశాంత్ వర్మతో ఓ సినిమాని నిర్మించబోతున్నారట..**

ప్రశాంత్ మంచి కథ సిద్ధం చేస్తే నిర్మాతగా మారతా.



కాజల్

# ఇద్దరూ ఉత్తమ నటులే!



విక్కీ కౌశల్



ఆయుష్మాన్ ఖురానా

**జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం ఈసారి ఇద్దరిని వరించింది. 'అంధాధున్' చిత్రంలోని నటనకు గానూ ఆయుష్మాన్ ఖురానా, 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' చిత్రానికిగానూ విక్కీ కౌశల్ ఈ అవార్డుని గెలుచుకున్నారు.**

కథాబలమున్న చిత్రాల్లో నటిస్తూ బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్న నటుడు ఆయుష్మాన్ ఖురానా. బుల్లితెర నుంచి వెండితెరకు వచ్చిన ఆయన 'విక్కీడోనర్'తో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకొన్నారు. ఆ తర్వాత ఆయన నటించిన 'దమ్ లగాకే హైసా' బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. ఆయుష్మాన్ నటించిన 'బరేల్లీ కీ బర్ఫీ', 'శుభ్ మంగళ్ సావధాన్' 'బధాయి హో' చిత్రాలు ఆయన్ని బాలీవుడ్‌లో నిలబెట్టాయి. గత ఏడాది ఆయన నటించిన 'అంధాధున్' చిత్రం ఏకంగా జాతీయ ఉత్తమ నటుణ్ని చేసింది. ఈ చిత్రంలో అంధుడైన పియానో ప్లేయర్‌గా ఆయన నటనకు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. తక్కువ బడ్జెట్‌లో రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కి, భారీ వసూళ్లు అందుకుందీ చిత్రం. ఆయుష్మాన్ ప్రస్తుతం 'డ్రీమ్ గర్ల్', 'బాలా'తో పాటు అమితాబ్‌బచ్చన్‌తో కలిసి 'గులాబో సితాబో', 'శుభ్ మంగళ్ జ్యాదా సావధాన్'లో నటిస్తున్నారు.

## నట కౌశల్:

'మసాన్', 'రాజీ', 'సంజు'....ఈ హిట్ చిత్రాల్లో కీలకమైన పాత్రల్లో మెరిసిన విక్కీ కౌశల్ 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'తో సోలో హీరోగా ఎంట్రీ ఇచ్చేశారు. అంతేకాదు బాలీవుడ్‌కు ఈ ఏడాది మంచి శుభారంభాన్ని ఇచ్చాడు. చిన్న చిత్రంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీసుని వసూళ్లతో నింపేసింది. రూ.250 కోట్లు పైగానే వసూలు చేసి సత్తా చాటింది. ఉరీలో భారత సైనికులను దారుణంగా హత మార్చిన పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పేందుకు భారత్ సైన్యం చేపట్టిన మెరుపు దాడుల కథతో తెరకెక్కిన ఈ చిత్రంలో మేజర్ విహాన్ సింగ్ షెర్గిల్‌గా విక్కీ నటనకు ప్రశంసలు వెల్లువెత్తాయి. ఇప్పుడు ఈ చిత్రంలోని నటనకు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'కు ఉత్తమ దర్శకుడి పురస్కారం గెలుచుకున్నారు ఆదిత్య ధర్.



సుధాకర్‌రెడ్డి యక్కంటి

# తెలుగువాడికి మరాఠీ చిత్రంతో పురస్కారం

'సైరత్' చిత్రంతో ఛాయాగ్రాహకుడిగా జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తెలుగు వ్యక్తి సుధాకర్ రెడ్డి యక్కంటి. గుంటూరుకు చెందిన ఆయన మధుమాసం, పౌరుడు, దళం లాంటి తెలుగు చిత్రాలకు పనిచేసి ఆ తర్వాత హిందీలో స్థిరపడ్డారు. బాలీవుడ్ చిత్రాలతో పాటు మరాఠీ చిత్రాలకు ఛాయాగ్రాహకుడిగా పనిచేశారు. తొలిసారి మరాఠీ చిత్రం 'నాల్'తో మెగాఫోన్ పట్టుకున్న ఆయన జాతీయ పురస్కారం దక్కించుకున్నారు. ఇందిరాగాంధీ జాతీయ ఉత్తమ నూతన దర్శకుడిగా నిలిచారు. తల్లీకొడుకుల మధ్య అనుబంధాన్ని 'నాల్' (బొడ్డు తాడు)లో హృద్యంగా మలిచారు. కెమెరాపై పట్టుండటంతో సినిమాని దృశ్యకావ్యంలా తీర్చిదిద్దారు.

# అవార్డులు బాధ్యతని పెంచాయి



నాని

"కొత్త ప్రతిభని ప్రోత్సహించాలనే వాల్ పోస్టర్ సినిమా సంస్థని స్థాపించాం. మేం నిర్మించిన తొలి చిత్రానికే రెండు జాతీయ పురస్కారాలు రావడం ఉత్సాహాన్నిచ్చింది" అన్నారు కథానాయకుడు నాని. ఆయన నిర్మించిన చిత్రం 'అ!'. ప్రశాంత్ వర్మ దర్శకుడిగా పరిచయమయ్యారు. జాతీయ పురస్కారాల్లో మేకప్ విభాగంలోనూ, కన్నడ చిత్రం 'కె.జి.ఎఫ్'తో కలుపుకొని విజువల్ ఎఫెక్ట్స్‌లోనూ పురస్కారాల్ని గెలుచుకొందీ చిత్రం. చిత్రానికి మేకప్ మెన్‌గా రంజిత్ పనిచేశారు. చిత్రంలో ఒకొక్క పాత్ర ఒక్కో తరహాలో, విభిన్నమైన వేషధారణతో కనిపిస్తుంటుంది. "రెజీనాకి మేకప్ చేయడం అన్నిటికంటే సవాల్‌గా నిలిచింది. నేనొక్కడినే కాకుండా, మా బృందం అందరిదీ ఈ పురస్కారం" అన్నారు మేకప్‌మేన్ రంజిత్. 'అ!'కి విజువల్ ఎఫెక్ట్స్‌ని సృష్టి క్రియేటివ్ స్టూడియోస్ సంస్థ తీర్చిదిద్దింది హైదరాబాద్‌కి చెందిన సంస్థ సృష్టి క్రియేటివ్ స్టూడియోస్. నాని స్పందిస్తూ "జాతీయ పురస్కారాలు నిర్మాతగా నా బాధ్యతని పెంచాయి. మా చిత్రబృందానికి కృతజ్ఞతలు" అన్నారు.

# చిన్న సినిమాను గుర్తించారు



రాహుల్ రవీంద్రన్

"సుశాంత్ కథని నమ్మడంతోనే మా 'చి.ల.సౌ' మొదలైంది. విడుదల సమయంలో మా చిత్రానికి నాగార్జున వెన్నెముకగా నిలవడంతో అందరికీ చేరువైంది. ఇప్పుడు జాతీయ పురస్కారం దక్కడం మరింత సంతోషాన్నిచ్చింది" అన్నారు రాహుల్ రవీంద్రన్. కథానాయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన 'చి.ల.సౌ'తో తొలిసారి మెగాఫోన్ పట్టారు. సుశాంత్, రుహానీ శర్మ జంటగా నటించారు. 66వ జాతీయ పురస్కారాల్లో ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే పురస్కారాన్ని సొంతం చేసుకొందీ చిత్రం. ఈ సందర్భంగా రాహుల్ రవీంద్రన్ విలేకర్లతో ముచ్చటించారు. "నేను దర్శకత్వం వహించిన రెండో చిత్రం 'మన్మథుడు 2' విడుదలైన రోజే, తొలి చిత్రం 'చి.ల.సౌ'కి జాతీయ పురస్కారం దక్కడం ఆనందంగా ఉంది. మా అమ్మానాన్నకు, నా భార్య చిన్మయి, నా సోదరుడికి, చిన్న సినిమాని గుర్తించిన జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు. నేను ఉద్యోగం వదిలేసి సినిమాల్లో ప్రయత్నిస్తానని చెప్పగానే వాళ్లు ఎంతగానో ప్రోత్సాహం అందించారు" అన్నారు.

# చిట్టిబాబు కోసం శబ్ద ప్రపంచాన్ని సృష్టించాం

ప్రేక్షకుల మనసులు గెలుచుకొన్న 'రంగస్థలం' జాతీయ పురస్కారాల్లోనూ మెరిసింది. ఉత్తమ ఆడియోగ్రఫీ విభాగానికిగానూ రాజాకృష్ణన్‌కి పురస్కారం దక్కింది. 'రంగస్థలం' ప్రయాణం గురించి సౌండ్ ఇంజినీర్ రాజకృష్ణన్ 'ఈనాడు సినిమా'తో చెప్పిన విషయాలివీ...

**మీరు ముందే పురస్కారాన్ని ఊహించారా?**

సినిమా బాగా రావాలని ప్రయత్నించాం కానీ పని చేస్తున్నప్పుడు పురస్కారం గురించి ఆలోచనే లేదు. శబ్ద ప్రధానమైన సినిమా ఇది. సుకుమార్ రాసిన ఈ కథే అన్ని విభాగాల నుంచి ఉత్తమ పనిని రాబట్టుకొంది. ఇందులో కథానాయకుడు చిట్టిబాబుకి వినబడదు. అతని కోసం మేం శబ్దంతో ఒక ప్రపంచాన్ని సృష్టించాం. అందుకే ఈ పురస్కారం అని నా అభిప్రాయం.



రాజాకృష్ణన్

**ఈ సినిమా ప్రయాణం కష్టంగా అనిపించిందా?**

నా దృష్టిలో కష్టం అనే మాట తప్పు. ఇలాంటి శబ్ద ప్రధానమైన సినిమా వచ్చినప్పుడు పని చేయడానికి మరింత ఉత్సాహంగా ఉంటుంది. నేను కేరళకి చెందిన వాడిని. తెలుగు సినిమాకి జాతీయ పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉంది.

**శబ్దం పరంగా దక్షిణాది చిత్ర పరిశ్రమ సాధించిన పురోగతిపై మీ అభిప్రాయం?**

ఇది వరకు థియేటర్ నుంచి బయటికి రాగానే తలనొప్పిగా అనిపించేది. ఇప్పుడు ప్రేక్షకుడు శబ్దాన్ని, దృశ్యాన్ని ఆస్వాదిస్తున్నాడు. దక్షిణాది చిత్ర పరిశ్రమ శబ్దం, దృశ్యం విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకొంటోంది. తెలుగు సినిమా పరిశ్రమ శబ్దానికి మరింత వెచ్చించడానికి ముందుకొస్తోంది.

# వసుంధర

## గాజు మాత్రమే కాదు...

ఈ గాజు పేరు స్మార్ట్ బ్యాంగిల్. ఇది మహిళ చేతికి అలంకార ప్రాయమే కాదు... అవసరమైతే ఆత్మరక్షణా అందిస్తుంది. దీన్ని తయారు చేసింది ఇరవై మూడేళ్ల గాదె హరీష్. మహిళలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు తమ చేతికి ఉన్న ఈ గాజును ప్రత్యేక కోణంలో తిప్పడం వల్ల దానిలోని పరికరం పనిచేయడం ప్రారంభిస్తుంది. ఆ మహిళ ఆపదలో ఉందనే సమాచారంతోపాటు, ఆమె ఎక్కడ ఉందనే





వివరాలను కుటుంబ సభ్యులు, స్నేహితులు, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి అందిస్తుంది. ఒకవేళ ఎవరైనా ఆమెను తాకేందుకు ప్రయత్నిస్తే ఆ గాజు బయటి పొర షాక్ కలిగిస్తుంది. అతనికి దీన్ని తయారు చేయాలనే ఆలోచన ఎలా వచ్చిందంటే... 'మహిళల భద్రత కోసం మార్కెట్లో రకరకాల ఆత్మరక్షణ పరికరాలు లభ్యమవుతున్నాయి. వాళ్లను దృష్టిలో పెట్టుకునే దీన్ని తయారుచేశా. ఈ రోజుల్లో మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, అపహరణల్లాంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. వారికి రక్షణ కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుని, సాంకేతికత జోడించి... నా స్నేహితుడు సాయి తేజ సాయంతో రూపొందించా. త్వరలో దీన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం' అని చెబుతున్నాడు హరీష్.

## చురుగ్గా... ఆరోగ్యంగా!

**వ్యాయామం చేస్తున్నప్పుడు... సన్నగా మారాలని అనుకున్నప్పుడు... ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం సర్వసాధారణం. ఏ పదార్థాలు మానేస్తున్నా... వీటిని మాత్రం తీసుకోవడం తప్పనిసరి. అవేంటో చూసేయండి.**

గుడ్లు: వీటిలో మాంసకృత్తులు ఎక్కువ. చేసే వ్యాయామాన్ని బట్టి ఒకటి లేదా రెండు తీసుకుంటే... మాంసకృత్తులతో పాటు అవసరమైన పోషకాలు అందుతాయి. ఇవి కొవ్వు పేరుకోకుండా చేస్తాయి.



గ్రీన్ టీ: శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను బయటకు పంపేందుకు ఈ టీ తోడ్పడుతుంది. కొలెస్ట్రాల్‌ను కరిగించడంతో పాటు ఫ్రీ రాడికల్స్‌ను నిరోధిస్తుంది. రోజూ కనీసం రెండుకప్పుల గ్రీన్ టీ తాగాలి. రోజంతా చురుగ్గా ఉంటారు.

స్మూథీలు: వీటిని ఇంట్లో సులువుగా తయారు చేసుకోవచ్చు. వీటితో త్వరగా ఆకలి వేయదు. శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. సగం అరటిపండు, మరేదయినా పండు, పాలు, పెరుగు, తేనె, ఖర్జూరాలు... ఇలా ఏవో ఒకటి కలిపి స్మూథీలు తయారు చేసుకోవచ్చు.

ద్రవపదార్థాలు: ఆకలి వేసినప్పుడు... ఏదో ఒకటి తినడం కన్నా... గ్లాసు మజ్జిగ, తాజా పండ్లరసం... ఇలాంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. పొట్ట నిండినట్లు ఉంటుంది. శరీరానికి శక్తీ అందుతుంది.



## జిడ్డుచర్మానికి తేనె చిట్కా

**ఈ కాలంలో వాతావరణంలోని తేమ వల్ల ముఖం జిడ్డుగా మారుతుంది. అదనంగా దుమ్మూధూళి చేరితే... మొటిమలు తప్పవు. వీటన్నింటికీ పరిష్కారం ఈ పూతలు. ప్రయత్నించి చూడండి.**

### తేనె, చక్కెరతో...

ఈ రెండింటిని సమానంగా తీసుకుని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, మృదువుగా మర్దన చేయాలి. పావుగంటయ్యాక గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. ముఖంపై పేరుకుపోయిన మురికి, జిడ్డు తొలగిపోవడమే కాదు... చర్మ రంధ్రాలూ శుభ్రపడి జిడ్డు సమస్య ఎదురుకాదు.

### ముల్తానీ మట్టితో...

చెంచా ముల్తానీ మట్టిలో రెండు చెంచాల నీరు కలపాలి. ఈ ముద్దను ముఖానికి రాసుకుని అరగంట తరువాత కడిగేయాలి. ఈ మట్టి ముఖంపై ఉన్న దుమ్ము, మురికి, జిడ్డును తొలగించి చర్మాన్ని మెరిపిస్తుంది.

అదనంగా: ఈ కాలంలో గోరువెచ్చటి నీటితోనే ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. అదీ రోజులో రెండుసార్లు మాత్రమే. జిడ్డుగా ఉందని రకరకాల ప్రయోగాలు చేయకూడదు.

### సెనగపిండి, నిమ్మరసంతో...

మూడు చెంచాల సెనగపిండిలో చెంచా నిమ్మరసం, సరిపడా పెరుగు వేసి పూతలా తయారు చేసుకోవాలి. దీన్ని ముఖానికి రాసి పావుగంటాగి చల్లటి నీటితో కడిగేయాలి. వారంలో రెండుసార్లు ఇలా చేస్తే జిడ్డు సమస్య ఉండదు.

# ఆమె అవసరానికి ఉచితంగా

**ఆకలి... రుచీ, శుచీ ఎరగదు. కాలే కడుపునకి నాలుగు మెతుకులు దొరికితే చాలు... ఎంత సంతోషమో! అలాంటివారిని చూసి అయ్యో అనుకోవడంతో సరిపెట్టుకోలేదామె. వారి బాధల్ని అమ్మలా అర్థం చేసుకున్నారు హైదరాబాద్‌కి చెందిన డాక్టర్ నీలిమా ఆర్య. పబ్లిక్ ఫ్రిజ్‌ల ఏర్పాటుతో నిరుపేదల ఆకలిని తీర్చే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా మహిళల నెలసరి అవసరానికి ఉపయోగపడేలా బహిరంగ ప్రదేశాల్లో శానిటరీ న్యాప్‌కిన్లను ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నారు.**






అర్థాకలితో జీవితాన్ని నెట్టుకొచ్చేవాళ్లు ఎంతమందో... కడుపు నిండా అన్నం తినలేక మరణించేవారి సంఖ్యా మన దేశంలో ఎక్కువేనని ప్రపంచబ్యాంకు నివేదికలు చెబుతున్నాయి. మనమేమో... ఇంట్లో తినగా మిగిలిన పదార్థాలను ఫ్రిజ్‌లో పెట్టుకుని మర్నాడు తింటాం. లేదంటే పారేస్తాం. ఆ ఆహారాన్ని పారేయకుండా... తినగా మిగిలిన, అదనంగా ఉన్న.... శుచీ శుభ్రమైన ఆహారం ఏదయినా సరే! మా యాపిల్‌హోం ఫ్రిజ్‌లో వదిలి వెళ్తే... ఆకలితో ఉన్నవారి కడుపు నింపొచ్చు. ఎవరైనా దాన్నుంచి తీసుకుని తినొచ్చు. అదే ఫీడ్ ద నీడ్ కాన్సెప్ట్. చిన్నప్పటి నుంచీ నేను ఏ పని చేసినా వైవిధ్యంగా ఉండాలనుకునేదాన్ని. సంపాదించిన దానిలో కొంత భాగాన్ని సమాజానికి తిరిగి ఇవ్వాలనే సూత్రాన్నీ నమ్ముతా. ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లు, పార్కులు వద్ద... చాలామంది ఆకలితో అన్నం కోసం ఎదురు చూడటం గమనించేదాన్ని. వాళ్లను తలచుకున్నప్పుడు చాలా బాధేసేది. దానికి పరిష్కారమే ఇది. నా కెరీర్‌ని మొదలుపెట్టిన హైదరాబాద్ నుంచే ఈ కార్యక్రమాలు చేయడానికి సిద్ధమయ్యా.

### సమస్యలెన్నో...

ఎవరికి ఆలోచన చెప్పినా బాగుందని అన్నారే కానీ... ఆచరణలో ఇది సాధ్యమేనా అని అడిగేవారు. ఈ అనుమానం రావడానికి కారణమూ ఉంది. కొన్ని కమ్యూనిటీలు, సంస్థలు ఈ తరహాలో పేదలకు ఆహారాన్ని అందించే ప్రయత్నం చేశాయి. నిర్వహణాలోపం, కలుషిత ఆహారం ఉంచడం, ప్రభుత్వ సహకారం తీసుకోకపోవడం వల్ల అవి విజయవంతం కాలేదని అర్థమైంది. జీహెచ్‌ఎంసీ అధికారులను సంప్రదించి నా ఆలోచన చెప్పి... అనుమతి అడిగితే 'ఇప్పటికే ఐదు రూపాయల అన్నపూర్ణ భోజనం అందుతోంది కదా! వర్కవుట్ అవ్వదేమో' అని సందేహించారు. నేనూ వెనక్కి తగ్గలేదు. ముందు స్థానికంగా ఓ చిన్న పాటి పరిశోధన చేశా.




### జీహెచ్‌ఎంసీ భాగస్వామ్యంతో...

వివిధ హోటళ్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలను సంప్రదించా. వారంతా మిగిలిపోయిన ఆహారాన్ని ఈ ఫ్రిజ్‌లలో ఉంచడానికి అంగీకరించారు. నేను రెండు నెలలపాటు నగరమంతా తిరిగి ఫ్రిజ్‌లను ఉంచేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించా. నా ప్రయత్నాన్ని ఎలా విజయవంతం చేయొచ్చో జీహెచ్‌ఎంసీ అధికారులకు అర్థమయ్యేట్లు చెప్పగలిగా. ఫ్రిజ్ పెట్టే స్థలం, విద్యుత్ బిల్లుని వాళ్లు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నా. దాతల సాయంతో వాటి ఏర్పాటు, నిర్వహణ నేను చూసుకుంటానని చెప్పా. ఈ కార్యక్రమం కోసం మొదట ఏడు లక్షల రూపాయలు నా సొంత డబ్బు ఖర్చు చేశా. దాతలూ సాయం చేయడానికి ముందుకొచ్చారు. ఈ ఫ్రిజ్ సామర్థ్యం 530 లీటర్లు. గతేడాది హైదరాబాద్ మాదాపూర్‌లో మొదలుపెట్టిన పబ్లిక్ ఫ్రిజ్‌ల కాన్సెప్ట్ ఇప్పటికి ముప్పైకి చేరింది. నిలోఫర్, ఈఎస్ఐ ఆసుపత్రుల దగ్గర, చందానగర్, శ్రీనగర్‌కాలనీ వంటిచోట్ల ఉంచాం. వివిధ జిల్లాల కలెక్టర్లకు నా ఆలోచన నచ్చి తమ ప్రాంతాల్లోనూ పెట్టమన్నారు. అలా మరికొన్ని జిల్లాల్లోనూ వీటిని ఏర్పాటుచేశాం. ఇప్పటికే వనపర్తిలో దీన్ని నిర్వహిస్తున్నాం. ఈ నెలాఖరుకల్లా గద్వాల్, మహబూబ్‌నగర్, సంగారెడ్డిలోనూ ఏర్పాటు చేయనున్నాం. ఈ ఏడాది చివరికల్లా కనీసం వంద ఫ్రిజ్‌లు పెట్టాలనేది మా లక్ష్యం. ఈ ఫ్రిజ్‌లలో శాకాహారం, మాంసాహారానికి ప్రత్యేక అరలుంటాయి. ప్రతి చోటా ఓ పర్యవేక్షకుడు అందుబాటులో ఉంటాడు. ప్రస్తుతం వీటి పనుల్లో సుమారు 12 మంది వివిధ రంగాలకు చెందిన కార్మికులు పని చేస్తున్నారు.

### వ్యక్తిగత అనుభవంతో...

వీటని ఏర్పాటు చేయడంతోనే నా పని అయిపోయిందని అనుకోలేదు. కొన్ని రోజులకే మరో సమస్య నా కళ్ల ముందు కనిపించింది. ఓసారి అత్యవసర పరిస్థితుల్లో కొనేందుకు ఎంత ప్రయత్నించినా ఎక్కడా నాకు శానిటరీ ప్యాడ్ దొరకలేదు. చేతిలో డబ్బు ఉన్నా... కొనుక్కోలేని పరిస్థితి. ఆ సమయంలో వచ్చిన ఆలోచనే... షీ నీడ్స్. సాధారణంగా మన దేశంలో నెలసరి, శానిటరీ ప్యాడ్ల వాడకం అంటే రహస్యం. అదేదో తప్పుగా భావిస్తారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆ స్త్రీ ఆరోగ్యంగా ఉంటుందని తెలిసినా... నిర్లక్ష్యం చేస్తారు. ఇవన్నీ గుర్తించే... బహిరంగ ప్రదేశాల్లో ఉచిత ప్యాడ్‌లను అందుబాటులో ఉంచే ప్రయత్నం చేశా. కొనుక్కోలేనివారు, అవసరం ఉన్నవారు వాటిని ఉచితంగా తీసుకునేలా ఈ కియోస్క్‌లను అక్కడక్కడా ఉంచేందుకు సిద్ధమయ్యా. దీనికి జీహెచ్‌ఎంసీ మద్దతు ఇచ్చింది. రోజూ సుమారు 50 ప్యాకెట్లను అందులో ఉంచడం ద్వారా మహిళల అవసరాల్ని తీర్చనున్నాం. ఈ కియోస్క్‌లలో వాడేసిన ప్యాడ్లను కాల్చివేసేందుకు ఇన్సినరేటర్ సైతం అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం గచ్చిబౌలిలో ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. త్వరలో అమీర్‌పేట్ మైత్రీవనంలోనూ ఏర్పాటు చేయబోతున్నాం. దీనిద్వారా ఆరోగ్యంపై అవగాహన, మహిళల అవసరం తీరుతుందనేది నా ఆశ. అప్పుడప్పుడూ వెళ్లి... ఈ ఫ్రిజ్‌లను గమనిస్తుంటా. త్వరలో మరో ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంలో ఉన్నా.

### కుటుంబం నుంచి నేర్చుకుని...

మాది బాపట్ల. నాన్న ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. నాన్న సైన్యంలో పనిచేసేవారు. అమ్మ గృహిణి. నాకు ఇద్దరు తమ్ముళ్లు. నేను దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకున్నా. ఇంట్లో నేనొక్కదాన్నే ఆడపిల్లని అయినా స్వతంత్ర ఆలోచనలతో పెరిగా. పద్మావతి మహిళా యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్‌లో లిటరేచర్ పూర్తి చేశా. దేశవిదేశాల్లోని వివిధ ప్రముఖ విశ్వ విద్యాలయాల్లో బోధనారంగంలో, కొన్నాళ్లు మీడియాలో ఉన్నత స్థానాల్లో పనిచేశా. దాదాపు పదిహేనేళ్ల పాటు వివిధ ఉద్యోగాలు చేసినా అవేవీ నాకు సంతృప్తినివ్వలేదు. సొంతంగా సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా చేయాలనుకున్నా. దీనికి స్ఫూర్తి మా కుటుంబమే. ఎవరికి ఏ ఆపద వచ్చినా నాన్న ముందుండేవారు. మా ఇంట్లో ఎప్పుడూ మా కుటుంబ సభ్యులకి కాకుండా మరో ఇద్దరు తినడానికి సరిపడా ఆహారం అందుబాటులో ఉంటుంది. ఇవన్నీ నాపై ఎంతో ప్రభావం చూపించాయి.

## బంగారం వెండి

**9న ముగింపు-క్రితం**

| తమిళనాడు (రూ. లలో) | | |
|---|---|---|
| ఆర్నమెంట్ (గ్రా) | 3,569 | 3,558 |
| వెండి (గ్రా) | 47.50 | 47.60 |



| | హైదరాబాద్ | | విజయవాడ | | ప్రొద్దుటూరు | | రాజమహేంద్రవరం | | విశాఖపట్నం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బంగారం(24 క్యా) | 38,620 | 38,370 | 38,730 | 38,820 | 37,500 | 37,400 | 38,570 | 38,470 | 38,250 | 38,400 |
| ఆర్నమెంట్ | 36,150 | 35,920 | 35,870 | 35,950 | 34,430 | 34,610 | 35,530 | 35,420 | 35,580 | 35,710 |
| వెండి(కిలో) | 44,510 | 44,230 | 44,700 | 45,200 | 43,500 | 43,400 | 44,500 | 44,600 | 45,500 | 43,700 |

## నజరానా

**మేకప్ బ్రష్‌లకు అంటుకున్న అలంకరణ ఉత్పత్తులను సులువుగా తొలగించాలంటే... వాటికి కాస్త ఆలివ్ నూనె రాసి ఆపై షాంపూతో శుభ్రం చేయాలి.**

## వ్యక్తిగత పరిశుభ్రతే ముఖ్యం!

**కొందరు మహిళల్ని జననాంగాల ఇన్‌ఫెక్షన్లు ఇబ్బందిపెడతాయి. వాటిని తగ్గించేందుకు వైద్యులు మందులు సూచించినా... అదనంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొన్ని ఉన్నాయి. అవేంటో తెలుసుకుందామా...**



- నూలు లోదుస్తుల్ని ఎంచుకోవాలి. అవి సౌకర్యాన్ని ఇవ్వడమే కాదు, వీటితో హానికారక బ్యాక్టీరియా, ఈస్ట్ వృద్ధి చెందకుండా చూసుకోవచ్చు. వాటిని గోరువెచ్చని నీటితోనే ఉతికి ఆరేయాలి. వర్షాకాలంలో అయితే రోజులో రెండుసార్లు లో దుస్తుల్ని మార్చుకోవడం మంచిది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి కానీ... సబ్బు వాడకూడదు. బిగుతుగా ఉన్న ప్యాంట్లూ వేసుకోకూడదు.
- నెలసరి సమయంలో... మరింత జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ఇన్‌ఫెక్షన్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మూడు గంటలకోసారి ప్యాడ్‌లను మార్చుకోవాలి. అప్పుడే చర్మం రాపిడికి గురికాదు.
- ఇలాంటి ఇన్‌ఫెక్షన్లు ఉన్నప్పుడు కొన్నిసార్లు దుర్వాసన సమస్య ఎదురవుతుంది. దాన్ని నివారించేందుకు పరిమళాలున్న డియోడరంట్ వాడటం సరికాదు. దాంతో సమస్య ఇంకా పెరుగుతుందే తప్ప తగ్గదు.

## బృందావనం

# చాంగు భళా చామంతి కళ

అన్ని పూలతోటల్లో చక్కగా అమరే పూల మొక్క చామంతి. ప్రత్యేకించి వర్షాకాలంలో ఈ మొక్కలు నాటితే... చలికాలం నాటికి పసుపు, నారింజ, ఎరుపు, ఊదా, గులాబీ, తెలుపు వంటి ఎన్నో రంగుల్లో పూలు పూసి కనువిందు చేస్తాయి. ఎక్కువ కాలం పూసే గుణం ఉండటం వల్ల వీటిని అలంకరణకూ వాడతారు. సమూహాలుగా, చిన్న గుంపులుగా... ఎలా నాటుకున్నా ఇవి అన్ని ప్రదేశాల్లోనూ చక్కగా పెరుగుతాయి. పైరిత్రిన్ అనే రసాయనం ఈ పూలల్లో ఉండటం వల్ల చామంతి ఉండే ఇళ్లల్లో కీటకాలు దరిచేరవు.





**ఎంపిక ఇలా...** ఈ మొక్కల్ని ఎంచుకునేటప్పుడు బాగా వృద్ధి చెందిన, వేర్లు ఉన్న కొమ్మల్ని వాడాలి. పద్దెనిమిది డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్న చోట ఉంచితే వేర్లు బాగా ఎదుగుతాయి. మొక్క నాటాక దానిపై న్యూస్ పేపర్లు కప్పితే నేరుగా సూర్యరశ్మి తగలకుండా వీటిని కాపాడుకోవచ్చు. మురుగు నీరు పోయే సౌకర్యం ఉన్న నేలల్లో ఇవి బాగా ఎదుగుతాయి. రోజూ దీనికి కనీసం ఆరుగంటలు ఎండ అవసరం. పెరట్లో పెంచుకునేటప్పుడు వర్షం పడినా తరువాత నీరు లేకుండా చూసుకోవాలి. ఎరువులు తగినన్ని అందిస్తే ఎక్కువ పూలు పూస్తాయి. తోటల్లో నాటుకునేటప్పుడు మేలైన మిశ్రమాన్ని తయారు చేసుకోవాలి. ఎలాగంటే... ఎర్రమట్టి, ఇసుక, పశువుల ఎరువుల్ని (3:1:1) నిష్పత్తిలో కలపాలి. కుండీ అడుగున చిన్న రాళ్లు ఉంచి... పైన ఈ మిశ్రమాన్ని పరవాలి. ఇలా సిద్ధం చేసుకున్న మట్టిలో జులై నుంచి ఆగస్టు మొదటి వారంలోపు మొక్కల్ని నాటుకోవచ్చు. నాటిన పిలకలు కొంత ఎత్తు ఎదిగాక మరో పెద్ద కుండీలోకి మార్చుకోవాలి. ఆ వెంటనే కొంత ఎరువు అందించాలి. మొక్కకు మొక్కకు మధ్య కనీసం పద్దెనిమిది అంగుళాల దూరం ఉండేలా చూసుకుంటే కొమ్మలు బాగా వస్తాయి.



**సంరక్షణ అవసరం:** చిన్న మొక్కలు ఆరు నుంచి ఎనిమిది అంగుళాల ఎత్తు ఎదిగినప్పుడు లేత ఆకులు, ఎదిగే మొదళ్లను తుంచాలి. అప్పుడే కాండం చుట్టూ కొత్త కొమ్మలు వస్తాయి. లేదంటే మొక్కలు బలహీనంగా పెరిగి కొన్ని పూలే పూస్తాయి. అధికవర్షాలు పడుతున్నప్పుడు వాటిపై ప్లాస్టిక్ కవరు వేయాలి. ఒకసారి పూలు పూసి, మొక్క చనిపోయే దశలో ఉన్నప్పుడు మట్టి స్థాయికి మొక్కను కత్తిరించాలి. తరువాత ఆకుల వ్యర్థాలను, అంతకు ముందు వేసిన ఎరువుల మిశ్రమాన్ని తీసేసి కొత్త మిశ్రమంతో నింపితే కొత్త వేర్లు, ఆకులు వస్తాయి. ఉదయం పూట నీటిని అందించడం వల్ల శిలీంద్రాలు వృద్ధి చెందవు. అవసరమైతే బోర్డ్యాక్స్ మిశ్రమాన్ని నీళ్లల్లో కలిపి చల్లుకోవాలి.





– సూరం సింధూజ,
అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం, హైదరాబాద్

# బుద్ధ నది కాలుష్యంపై సమరం!

- 'ఈటీవీ భారత్' చైతన్య భేరి
- స్పందించిన పంజాబ్ కాలుష్య నియంత్రణ మండలి
- లుథియానా మేయర్ సహా 8 మందిపై కేసులు



పంజాబ్: ఒకప్పుడు అది బుద్ధ నది. ఇప్పుడు కలుషిత జలాలతో కూడిన బుద్ధ డ్రైన్ (మురుగు కాలువ). పంజాబ్‌లోని లుథియానా తదితర ప్రాంతాల గుండా ప్రవహించే ఈ నది ఏకంగా 'బుద్ధ నల్లా'గా మారిపోయింది. ఫలితంగా పరిసర ప్రాంతాల ప్రజలు క్యాన్సర్ వంటి భయానక వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ కాలువలో కాలకూటంలా నీళ్లు నిండా చెత్త కనిపిస్తున్నా లుథియానా పురపాలక సంఘం, ఇతర అధికారులు ఇన్నాళ్లూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఈ నేపథ్యంలో దుర్భర వాస్తవ పరిస్థితులపై అన్ని వర్గాలను చైతన్యం చేసేందుకు 'ఈటీవీ భారత్' నడుం బిగించింది. ఈ దుస్థితిని మార్చేందుకు.. ప్రజల పక్షాన నిలబడి వరుస కథనాలందిస్తుండటమే కాకుండా క్షేత్ర స్థాయిలోనూ వివిధ కార్యక్రమాలు చేపట్టింది. నది కాలుష్య తీవ్రతపై ప్రజలను కదిలించే ఓ పంజాబీ గీతాన్ని కూడా రూపొందించింది. స్థానికులతో పాటు, వైద్యులు, సమాచార హక్కు కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు, పురపాలక కౌన్సిలర్లందరినీ తట్టి లేపింది. దీనికి అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. స్పందించిన పంజాబ్ కాలుష్య నియంత్రణ మండలి (పీపీసీబీ) ఏకంగా లుథియానా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, కమిషనర్ సహా సంబంధిత అధికారులపై పోలీసు కేసు పెట్టింది. మరోవైపు నదీ పరివాహక ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించిన 'ఈటీవీ భారత్' వాటిని పరీక్షలకు పంపించింది. అనివేదికలు, సంబంధిత వీడియోలు, కథనాలు వంటివాటితో ఆగస్టు 15న పంజాబ్ కేబినెట్ మంత్రిని కలవడానికి ఏర్పాట్లు చేస్తోంది. నదిని ప్రక్షాళన చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా కోరనుంది.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

# కుండపోత.. ప్రాణాలు అరచేత..

- నాలుగు రాష్ట్రాల్లో 32 మంది మృతి
- కేరళలో కొండచరియల కింద ఇరుక్కున్న 40 మంది
- ముంచెత్తుతున్న వరదలు




వయనాడ్ జిల్లా కల్పెట్టలో భారీ వర్షం ధాటికి జలమయమైన ఓ వీధి ★ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో వరద బాధితులను శుక్రవారం సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం సిబ్బంది

దిల్లీ: దేశంలోని పలు ప్రాంతాలను శుక్రవారం కూడా భారీ వర్షాలు ముంచెత్తాయి. కేరళ, ఉత్తరాఖండ్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం 32 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మొత్తం 14 జిల్లాలకుగానూ తొమ్మిది జిల్లాల్లో ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. శుక్రవారం ఒక్క రోజునే 20 మంది మృతి చెందారు. దీంతో గత మూడు రోజుల్లో మరణించిన వారి సంఖ్య 28కి పెరిగింది. కొండచరియలు పడి మరో 40 మంది ఇరుక్కుపోయారు. గత ఏడాది ఆగస్టులో శతాబ్దంలో ఎన్నడూ ఎరగని వరదలు రాగా, మళ్లీ ఇప్పుడు అదే సమయంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆందోళన నెలకొంది. జాతీయ విపత్తు స్పందన దళానికి చెందిన 13 బృందాలు, 180 మంది సైనిక అధికారులు, 16 కోస్టు గార్డు బృందాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయి. 24 చోట్ల కొండచరియలు విరిగిపడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కోచి విమానాశ్రయాన్ని ఆదివారం వరకు మూసివేశారు. అళప్పుళలో నిర్వహించాల్సిన నెహ్రూ ట్రోఫీ పడవ పోటీలను రెండో ఏడాది కూడా ప్రభుత్వం రద్దు చేసింది.

మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాలో హెలికాప్టర్ ద్వారా ఆహార పొట్లాలను జార విడిచారు. ఈ జిల్లాలో నౌకా దళానికి చెందిన 12 బృందాలు సహాయ చర్యలను చేపడుతున్నాయి. నాసిక్ జిల్లా త్రయంబకేశ్వర్‌లో భారీ వర్షాలు కురుస్తుండడంతో గోదావరిపై ఉన్న గంగాపూర్, దర్న ఆనకట్టల నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. గోవాలో వర్షాలు తగ్గడంతో సహాయ చర్యలు ఊపందుకున్నాయి. మధ్యప్రదేశ్‌లోని బర్వానీ, దార్ జిల్లాలు వరదకు గురయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని చమేలీ జిల్లా ఉలంగర నదిలో తల్లి, ఏడేళ్ల కుమార్తె కొట్టుకుపోయారు. రిషీకేశ్- బదరీనాథ్ జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది. తమిళనాడులోని నీలగిరి కొండల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

### ప్రధానికి రాహుల్ ఫోన్

కేరళలోని వయనాడ్ జిల్లాలో వరదల్లో చిక్కుకున్న ప్రజలకు సహాయం అందించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఫోన్ చేశారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రధాని ఆయనకు హామీ ఇచ్చారు. రాహుల్ ప్రస్తుతం వయనాడ్ ఎంపీ కావడం గమనార్హం.

### వరదల్లో మహారాష్ట్ర మంత్రి సెల్ఫీలు

వరద బాధితుల పరామర్శకు వెళ్లిన మహారాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి గిరీశ్ మహాజన్ నవ్వుతూ రెండు సెల్ఫీ వీడియోలు తీసుకోవడం విమర్శలకు తావిచ్చింది. ఆయనది 'విపత్తుల పర్యాటకం' అని ప్రతిపక్షాలు విమర్శించాయి.

# 60 సెకన్లలో భగత్‌సింగ్ చిత్రం..



కర్ణాటక: కేవలం 60 సెకన్లలోనే భగత్‌సింగ్ చిత్రాన్ని తలకిందులుగా గీసి మైసూర్‌లోని నదనహళ్లికి చెందిన పునీత్‌కుమార్ అందరినీ అబ్బుర పరుస్తున్నారు. ఓ పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన స్నేహితుల సూచనల మేరకు తాను ఈ చిత్రం వేస్తుండగా తీసిన వీడియోను 'వరల్డ్ రికార్డ్స్ ఇండియా' వెబ్‌సైట్‌కు పంపించగా సంబంధిత ప్రతినిధులు ఈ రికార్డును గుర్తించారు. దీనిపట్ల పునీత్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిత్రాన్ని గీసేందుకు రోజూ సాధన చేసేవాడినని, మొదట్లో 130 సెకన్ల సమయం పట్టేదని తెలిపారు.

# కశ్మీర్‌లో సడలిన ఆంక్షలు



జమ్మూలో ఆంక్షలు సడలించడంతో వీధిలోకి వచ్చిన యువకుడు

శ్రీనగర్: ప్రత్యేక ప్రతిపత్తి తొలగింపు, రాష్ట్ర విభజన నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా విధించిన భద్రతాపరమైన ఆంక్షలతో కొద్దిరోజులుగా ఇళ్లకే పరిమితమైన జమ్మూ-కశ్మీర్ ప్రజలు శుక్రవారం కొద్దిగా ఊపిరి పీల్చుకున్నారు. నిషేధాజ్ఞలను సడలించడంతో వారు స్థానిక మసీదుల్లో ప్రార్థనలు చేసుకున్నారు. మంగళవారం నుంచి కశ్మీర్‌లో పర్యటిస్తున్న దోబాల్ శుక్రవారం శ్రీనగర్‌లోని సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించారు. సోపోర్‌లో ఆందోళనకారులు రాళ్లు రువ్వగా.. వారిని అధికారులు చెదరగొట్టారు. లోయలో కేబుల్ టీవీ నెట్‌వర్క్ ద్వారా దూరదర్శన్ సహా మూడు వార్తా చానళ్లను మాత్రమే ప్రసారం చేస్తున్నారు. ఆంక్షలను తొలగించాలంటూ ఈ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు, వృత్తి నిపుణులు శుక్రవారం దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు.

- జమ్మూ-కశ్మీర్‌లో పర్యటించేందుకు శ్రీనగర్ విమానాశ్రయంలో దిగిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ అగ్రనేత డి.రాజాను అధికారులు దిల్లీకి పంపేశారు.
- గురువారం వాఘా సరిహద్దుల్లో పాకిస్థాన్ అధికారులు నిలిపివేసిన సంఝౌతా ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం 8.05 గంటలకు దిల్లీ చేరుకుంది. మరోవైపు రాజస్థాన్‌లోని సరిహద్దుల గుండా రెండు దేశాల మధ్య ప్రయాణించే థార్ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా పాక్ నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. భారత్‌తో సాంస్కృతిక మార్పిడిని పాకిస్థాన్ నిషేధించింది.
- అశాంతికి, ఆందోళనకు కారకులయ్యే అవకాశం ఉన్న మరో 20 మందిని జమ్మూ-కశ్మీర్ ప్రభుత్వం తాజాగా ఆగ్రా జైలుకు తరలించినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు.
- జమ్మూ-కశ్మీర్ విషయంలో తాజా వాస్తవాలను పాకిస్థాన్ గుర్తించి, తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని మానుకోవాలని భారత్ హితవు పలికింది. ఆ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడానికి నిరసనగా పాక్ దౌత్యపరమైన ఒత్తిడిని పెంచుతున్న నేపథ్యంలో ఈ మేరకు స్పష్టంచేసింది. భారత నిర్ణయాల పట్ల ఆ దేశం కలవరపాటుకు గురవుతోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ పేర్కొన్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అంతర్జాతీయ సమాజాన్ని నమ్మించేందుకు ఆ దేశం ప్రయత్నిస్తోందన్నారు. వీటిని ప్రపంచ దేశాలు విశ్వసించబోవని చెప్పారు.
- జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని భారత్ రద్దు చేసిన నేపథ్యంలో తన జోక్యానికి పాకిస్థాన్ చేసిన విజ్ఞప్తిని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తోసిపుచ్చారు. రెండు దేశాల మధ్య శిమ్లా ఒప్పందం ఉందని గుర్తుచేస్తూ తృతీయ పక్ష మధ్యవర్తిత్వానికి అవకాశం లేదన్నారు.
- కశ్మీర్ సమస్యను అఫ్గానిస్థాన్‌తో ముడిపెట్టొద్దని, జమ్మూ-కశ్మీర్‌లో హింసకు తావులేకుండా ఉభయ దేశాలు సంయమనం పాటించాలని భారత్, పాకిస్థాన్‌లకు తాలిబన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి జబీలుల్లా ముజాహిద్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.
- భారత్-పాకిస్థాన్‌లు తమకు స్నేహపూర్వక మిత్ర దేశాలని... కశ్మీర్ విషయంలో ఐరాస భద్రతా మండలి తీర్మానాలు, శిమ్లా ఒప్పందాన్ని అనుసరించి ఉభయ దేశాలు సమస్యలను పరిష్కరించుకోవాలని చైనా సూచించింది. కశ్మీర్ విషయమై మద్దతు కోరేందుకు పాకిస్థాన్ విదేశాంగమంత్రి మహమ్మూద్ ఖురేషి శుక్రవారం చైనాకు వచ్చారు. విదేశాంగమంత్రి వాంగ్ యూతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక చర్చల ద్వారా ఉభయ దేశాలు కశ్మీర్ సమస్యను పరిష్కరించుకోవాలని వాంగ్ యీ ఈ సందర్భంగా ఆయనకు సూచించారు.



## అందుకోండి సమరయోధుల దీవెనలు!

క్విట్ ఇండియా ఉద్యమం 77వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు స్వాతంత్ర్య సమరయోధులను దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోవింద్, మోదీని స్వాతంత్ర్య సమరయోధులు నిండు మనసుతో దీవించారు.

## పూర్తిచేసే రావాలనుకున్నా..

### జమ్మూ-కశ్మీర్ బిల్లుపై వెంకయ్యనాయుడి వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: జమ్మూ-కశ్మీర్ విభజన బిల్లు, 370 అధికరణం రద్దు తీర్మానాలు రాజ్యసభ ముందుకు వచ్చేనాడు తాను దేవుడి ముందు నిలబడి వాటిని పూర్తి చేసే రావాలని నిర్ణయించుకున్నానని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం మీడియా ప్రతినిధులకు విందు ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఈ బిల్లులు సభ ముందుకొచ్చినప్పుడు ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో, నేను ఎలా స్పందిస్తానోనని కుటుంబసభ్యులంతా ఆందోళనకు గురయ్యారు. ఆరోజు ఎయిమ్స్ డాక్టర్లు వచ్చి పరీక్షించారు. సభకు వెళ్లేముందు నా సతీమణి వచ్చి తనతోపాటు పూజకు కూర్చోమని కోరింది. పూజగదిలోకి తీసుకెళ్లి పూజచేయించింది. ప్రశాంతంగా ఉండాలని కోరింది. అన్నీ అనుకున్నట్లుగానే సాగాయి'' అని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. విద్యార్థిగా ఉన్నప్పుడు కశ్మీర్ కోసం సమ్మె చేసిన తన ఆధ్వర్యంలోనే జమ్మూ-కశ్మీర్ బిల్లు ఆమోదం పొందుతుందనుకోలేదన్నారు.

## 'జమ్మూకశ్మీర్' బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర

దిల్లీ: 'జమ్మూకశ్మీర్ పునర్విభజన' బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం ఆమోద ముద్ర వేశారు. దీంతో ఈ ప్రక్రియ సంపూర్ణంగా పూర్తయినట్లే. జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేస్తూ పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. దీనికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారని, అక్టోబరు 31న భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆ రోజు నుంచి ఈ చట్టం అమల్లోకి వస్తుందని కేంద్ర హోంశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. రెండు ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతలను కేంద్రమే చేపడుతుందని తెలిపింది.

## కిసాన్ మాన్-ధన్ యోజనకు శ్రీకారం

- రైతుల పేర్ల నమోదు ప్రారంభం
- 5 ఎకరాల లోపు పొలం ఉన్న వారు అర్హులు
- 60ఏళ్లు దాటాక ప్రతినెలా రూ.3 వేల పింఛను

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2019-20 బడ్జెట్‌లో ప్రకటించిన ప్రధాన మంత్రి కిసాన్ మాన్-ధన్ యోజన (పీఎం-కేఎంవై)కు పేర్ల నమోదు శుక్రవారం ప్రారంభమైంది. ఈ పథకంలో చేరిన రైతులకు 60 ఏళ్ల వయస్సు వచ్చిన తర్వాత నెలకు రూ.3వేల చొప్పున పింఛను లభిస్తుంది. జమ్మూ-కశ్మీర్, లద్దాఖ్ సహా దేశ వ్యాప్తంగా అర్హులైన రైతులందరికీ ఈ పథకం వర్తిస్తుందని కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. అయిదు ఎకరాలు (రెండు హెక్టార్ల) లోపు భూమి కలిగిన రైతులు దీనికి అర్హులు. కామన్ సర్వీస్ కేంద్రాల్లో ప్రాథమికంగా పేర్లను ఉచితంగానే నమోదు చేసుకోవచ్చని, ఇందుకయ్యే రూ.30 వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి చెప్పారు. 18 నుంచి 40 ఏళ్ల లోపు రైతులు, వారి జీవిత భాగస్వాములు పథకంలో చేరవచ్చు. సభ్యులుగా చేరేవారి వయస్సు ప్రాతిపదికగా నెలకు రూ.55 నుంచి 200 వరకు చెల్లించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. ప్రతి సభ్యుడు చెల్లించే మొత్తానికి సమాన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం పింఛను పథకానికి జమ చేస్తుందని చెప్పారు. 60 ఏళ్లు వచ్చిన తర్వాత ప్రతినెలా రూ.3వేల చొప్పున పింఛను వస్తుంది. చందాదారు 60 ఏళ్ల లోపే మృతి చెందితే అప్పటి వరకూ అతను/ఆమె చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో సహా జీవిత భాగస్వామికి చెల్లిస్తారు. జీవిత భాగస్వామి లేని పక్షంలో నామినీకి అందజేస్తారు. పింఛనుదారు 60 ఏళ్ల వయస్సు దాటాక మరణిస్తే జీవిత భాగస్వామికి పింఛనులో 50 శాతాన్ని అందజేస్తారు. పథకంలో చేరిన తర్వాత కనీసం అయిదేళ్ల వరకూ క్రమం తప్పకుండా నెలవారీ విరాళాన్ని చెల్లించాలి. అలా అయితేనే అయిదేళ్ల తర్వాత పింఛను పథకం వద్దనుకున్నా అప్పటి వరకూ చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో సహా పొందగలరు.

# కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముకుల్ వాస్నిక్?

- నేడు సీడబ్ల్యూసీ భేటీ

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు ఎవరన్న విషయం శనివారం తేలనుంది. సోనియా గాంధీ నివాసంలో జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్‌కు ఈ పదవి దక్కవచ్చని ఊహాగానాలు వ్యాపించాయి. మహారాష్ట్రకు చెందిన దళిత నాయకుడైన వాస్నిక్ (59) గతంలో ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆయనతో పాటు కర్ణాటకకు చెందిన దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే (77) పేరు కూడా వినిపిస్తోంది. ప్రస్తుతం తాత్కాలిక ప్రాతిపదికన అధ్యక్షుడిని నియమిస్తారని, ఆ తరువాత ఆయన ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి పూర్తిస్థాయి అధ్యక్షుడిని ఎన్నుకుంటారని వినిపిస్తోంది. అయితే అధ్యక్ష పదవికి అంతర్గత ఎన్నికలు నిర్వహించడం తగదని, అవి జరిగితే పార్టీలో చీలిక వస్తుందని సీనియర్ నేతలు అహ్మద్ పటేల్, ఏకే ఆంటోనీ, కె.సి.వేణుగోపాల్‌లు శుక్రవారం సోనియా గాంధీని హెచ్చరించినట్లు తెలిసింది.

### ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకించాల్సిందే: రాహుల్

కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు సక్రమమైతే బలపరచాలని, దేశ ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఏకపక్షంగానూ నియంతృత్వ ధోరణితోనూ నిర్ణయాలు తీసుకుంటే కచ్చితంగా వ్యతిరేకించాల్సిందేనని రాహుల్ గాంధీ అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అనంతర పరిణామాలపై చర్చించేందుకు ఏఐసీసీ వార్ రూమ్‌లో శుక్రవారం రాత్రి నేతలు సమావేశమయ్యారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, సీనియర్ నేతలు, వివిధ రాష్ట్రాల పీసీసీల అధ్యక్షులు, కార్యనిర్వాహక అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 370వ అధికరణ రద్దుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించడం లేదని. అదే సమయంలో విపక్షనేతలను, జమ్ము-కశ్మీర్‌లోని పార్టీలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఈ బిల్లులు ప్రవేశపెట్టడాన్ని మాత్రమే తప్పు పడుతున్నామని సమావేశంలో రాహుల్ అన్నట్లు తెలిసింది. రాజ్యసభలో చిదంబరం, గులాంనబీ ఆజాద్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి వ్యవహరించిన తీరును ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు తప్పుపట్టినట్లు తెలిసింది. మనం ఏం మాట్లాడాలో అధికార పార్టీనే నిర్ణయిస్తోందని, ముందస్తు వ్యూహం కొరవడడంతోనే ఈ సమస్య తలెత్తుతోందని, అజెండాను మనమే నిర్ణయిద్దామని మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నట్లు తెలిసింది. 370 అధికరణం రద్దును సమర్థిస్తూనే ఆ అధికరణ ప్రాధాన్యత, నాటి పరిస్థితులను ప్రజలకు వివరించాలని నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. రైతులు, నిరుద్యోగుల సమస్యలపై దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ కోరినట్లు తెలిసింది.

## రఘువంశ వారసులు అయోధ్యలో ఉన్నారా..?

### న్యాయవాదిని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: రఘువంశానికి చెందిన వారు (శ్రీరాముడి వారసులు) ఎవరైనా అయోధ్యలో ఉన్నారా అని సుప్రీంకోర్టు ధర్మాసనం రామ్ లల్లా విరాజ్‌మాన్ సంస్థ తరఫున కేసును వాదిస్తున్న న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ విషయం తెలుసుకోవాలని ఆసక్తిగా ఉందని పేర్కొంది. అయోధ్యలో రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపై ఉన్న వ్యాజ్యాలను సుప్రీంకోర్టు ధర్మాసనం రోజువారీగా విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం కూడా కోర్టు ఈ కేసును విచారించింది. దీనిపై విరాజ్‌మాన్ సంస్థ తరఫున వాదిస్తున్న న్యాయవాది పరాశరణ్ వివరణ ఇస్తూ ఈ విషయం పై తనకు సమాచారం లేదన్నారు. తెలుసుకొని విన్నవిస్తానని సమాధానం ఇచ్చారు.



# వయ్యారి మామలు!

- అందంగా కనిపించాలని యువకుల ఆరాటం
- రోజూ గంటసేపు గ్రూమింగ్

దిల్లీ: 'వీడిలో సంథింగ్ స్పెషల్ ఏదో ఉందిరోయ్' అని అనిపించుకోవాలని కుర్రాళ్లు తెగ ఆరాట పడిపోతున్నారట. కొత్త లుక్స్ కోసం ఖర్చుకు వెనకాడకుండా డబ్బులు గుమ్మరిస్తున్నారట. కాంతిమంతమైన చర్మం.. ఫంకీగా కనిపించే జుట్టు.. చూపులు తిప్పుకోనివ్వని గడ్డం కోసం తెగ ఆరాటపడిపోతున్నారట. మన దేశంలోని ఒక్కో కుర్రాడు రోజూ సగటున 42 నిమిషాలు అద్దానికి అతుక్కుపోతున్నాడంటే అతిశయోక్తి కానేకాదంటోంది... లండన్‌కు చెందిన మింటెల్ పరిశోధన సంస్థ! యువకుల షోకుల పోకడేంటో తన తాజా నివేదికలో పూసగుచ్చింది.

### మార్కెట్ ఖుషీ ఖుషీగా

ఆడవారిని మెప్పించడం ఒక పట్టాన అయ్యే పనికాదు. అదే మగాళ్లయితే... టక్కున కొనేస్తారన్నది గ్రూమింగ్ సంస్థల కొత్త ఫిలాసఫీ. అందుకే మరి... మగవారి సబ్బులు, మెన్స్ క్రీములు, బాయ్స్ షాంపూలు అంటూ వాళ్ల మనసు తొలిచేస్తున్నారు. ఈ ఉత్పత్తుల మార్కెట్ ఇప్పుడు వేలాది కోట్ల రూపాయలకు చేరింది.

### 'సెంట్'మెంట్‌తో కొట్టేస్తారు...

సాహసాలేవో చేసి 'వీడు మగాడ్రా బుజ్జీ' అని నిరూపించుకోవడం పాతతరం ఆలోచనని భావిస్తున్నారు. శరీరం, జుట్టు నుంచి దుర్వాసన రాకుండా చూసుకోవాలన్న 'సెంట్'మెంట్ ఉంటే చాలన్న భావన చాలామంది యువకుల్లో ఉంది. అందుకే మరి కొన్నేళ్లుగా పురుషుల డియోడరెంట్‌లకు అంతకంతకూ గిరాకీ ఎగబాకుతోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. నడినెత్తి నుంచి అరికాలి వరకూ... మగవారి దేహ సౌందర్యానికి అవసరమైన సాధనాలెన్నో మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. చర్మాన్ని నునుపెక్కించే ప్రత్యేకమైన సబ్బులు, వెంట్రుకలను తొలగించే లోషన్లు, లేత గులాబీలను తలపించే అదరపు లేపనాలు, గడ్డపు తైలాలు, గోళ్ల కందెనలు, నున్నగా స్పర్శించే రేజర్లు, పాదక్రీములు... ఎన్నెన్నో!



**రూ.16,800 కోట్లు**
2018లో పురుషుల సౌందర్య ఉత్పత్తుల మార్కెట్ విలువ

**రూ. 35,000 కోట్లు**
2021 నాటికి మార్కెట్ అంచనా

(ఆధారం: అసోచామ్ నివేదిక)

### ఆడవాళ్లవి మనకెందుకు?

"ఒకప్పుడు అమ్మాయిలు వాడే సౌందర్య సాధనాలనే మగాళ్లూ వాడేవారు. ఇప్పుడు అలా చేయడాన్ని సిగ్గుగా భావిస్తున్నారు" అని చెప్పారు... 60 రకాల ఉత్పత్తులతో పురుషుల గ్రూమింగ్ మార్కెట్‌లో ప్రవేశించిన 'ద మాన్ కంపెనీ' ఎండీ హితేశ్ డింగ్రా. మొన్నామధ్య వరకూ మగవారి సౌందర్య సాధనాలకు పెద్ద డిమాండ్ ఉండేది కాదట. గడ్డం కోసం ప్రత్యేక ఉత్పత్తులను తీసుకొచ్చినప్పట్నుంచి వ్యాపారం బాగా జోరెక్కిందట. ఇందుక్కారణం.. విరాట్ కోహ్లీ, బాలీవుడ్ నటుల వంటి గడ్డపు అందాలను తామూ సొంతం చేసుకోవాలన్న కుర్ర కోరికేనని చెబుతున్నారు.

### 'స్పా'యిసీగా తయారవ్వాలని...

వీకెండ్ వస్తే గడ్డం స్టైల్‌ను మార్చేయాల్సిందేనని భావిస్తున్నారట చాలామంది యువకులు. ముఖ్యంగా ఐటీ, కార్పొరేట్ ఉద్యోగులు. కొత్త కొత్త ఆకృతుల్లో గడ్డం చేయించుకోవడానికి తరచూ సెలూన్ల చుట్టూ తిరుగుతున్నారని ఎన్రిచ్ సెలూన్ మార్కెటింగ్ డైరెక్టర్ సచిన్ కామత్ చెప్పారు. గడ్డం చేయించుకునేందుకు ఒకప్పుడు సెలూన్లకు సగటున రోజూ 25 మంది వస్తే ఇప్పుడు 32 మంది వస్తున్నారని చెప్పారు. కార్యాలయాల్లో ఉద్యోగుల మధ్య పోటీ ఎక్కువవుతుండటంతో... అందంగా, ఆరోగ్యంగా, హుందాగా, నిండైన ఆత్మవిశ్వాసంతో కనిపించాలని చాలామంది పురుష ఉద్యోగులు ఆలోచిస్తున్నట్లు బియర్డో సహ వ్యవస్థాపకుడు అషుతోష్ అన్నారు.

మగవారికి ఇప్పుడు 'రెడీ సిండ్రోమ్' పట్టుకుంది. అందంగా తయారయ్యేందుకు చాలా సమయమే వెచ్చిస్తున్నారు.

### దేనికి ఎన్ని నిమిషాలు

| | |
|---|---|
| 16 | దేహాన్ని శుభ్రం చేసుకోవడం |
| 14 | తల దువ్వుకోవడం, సవరించుకోవడం |
| 12 | మొహం శుభ్రం చేసుకోవడం |
| 42 | మొత్తంగా రోజుకు ఒక్కోయువకుడు గ్రూమింగ్‌కు వెచ్చిస్తున్న సమయం |

మెట్రో నగరాల్లోనైతే 61 నిమిషాలు వెచ్చిస్తేగాని మగాళ్లు సోగ్గా తయారు కాలేకపోతున్నారట. ఈ సంస్కృతి క్రమంగా చిన్న పట్టణాలు, పల్లెలకూ విస్తరిస్తోందంటున్నారు అధ్యయనకర్తలు.



ఏ సేవలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు?
- ఫెయిర్‌నెస్ ట్రీట్‌మెంట్
- మేనిక్యూర్
- పెడిక్యూర్
- వ్యాక్సింగ్
- ఫేషియల్



## గొర్రెల పంపిణీ అవకతవకల్లో 24 మందిపై చర్యలు: సమాఖ్య వెల్లడి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాయితీ గొర్రెల పంపిణీలో అవకతవకలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నామని గొర్రెల, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య స్పష్టం చేసింది. 2017 నుంచి ఇప్పటివరకు ఏడుగురు జిల్లా పశుసంవర్ధక అధికారులు, 16 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఒక ఏడీపై చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. గొర్రెల పంపిణీ, రవాణాలో అక్రమాలు, నిబంధనలకు విరుద్ధంగా తక్కువ వయసున్న గొర్రెల్ని విక్రయించడం, లబ్ధిదారులు, బ్రీడర్లు, విక్రయదారుల నుంచి కమిషన్ వసూలు, ముందస్తు అనుమతి లేకుండా గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్ చేసిన ఘటనలపై ముందు నుంచీ నిఘా ఉంచామని ఫెడరేషన్ ఎండీ లక్ష్మారెడ్డి తెలిపారు. అక్రమాలకు పాల్పడ్డ పశువైద్యులను కొందరిని శాశ్వతంగా సస్పెండ్ చేశామని, మరికొందరిపై శాఖాపరమైన విచారణ కొనసాగుతోందని వివరించారు. ఇందుకు సంబంధించి జిల్లాలవారీ జాబితాను ఆయన మీడియాకు విడుదల చేశారు. వికారాబాద్ జిల్లాల్లో అత్యధికంగా నలుగురిపై చర్యలు తీసుకోగా ఇందులో ఒక జిల్లా పశువైద్యాధికారి, ముగ్గురు అసిస్టెంట్ సర్జన్లు ఉన్నారు. మహబూబ్‌నగర్, సిరిసిల్ల జిల్లాల్లో ముగ్గురు, గద్వాల, నల్గొండ, సిద్దిపేట, భూపాలపల్లిలో ఇద్దరు, జనగామ, మంచిర్యాల, వనపర్తి, కామారెడ్డి, రంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లో ఒక్కోఅధికారిపై చర్యలు తీసుకున్నట్లు ఫెడరేషన్ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

## వీధికుక్కలను చంపించిన తెల్‌దేవరపల్లి సర్పంచిపై వేటు

### 'ఈనాడు' కథనానికి స్పందన

చందంపేట, న్యూస్‌టుడే: గ్రామంలో స్వైరవిహారం చేస్తున్నాయంటూ 30కి పైగా వీధికుక్కలను చంపించినందుకు..నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని తెల్‌దేవరపల్లి సర్పంచి సపావట్ పాపానాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. గత జులై 10న.. బాధిత గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు రావడంతో కుక్కల వధపై 'ఈనాడు' ప్రధాన సంచికలో ప్రచురించడం విదితమే. మూగప్రాణులను చంపించారంటూ జంతుప్రేమికుల స్వచ్ఛంద సేవా సంస్థ 'బ్లూ క్రాస్' జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. డీపీవో, ఎంపీడీవో బృందాలు ఇచ్చిన నివేదిక ఆధారంగా సర్పంచిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయని ఈవోఆర్డీ నాగార్జున వెల్లడించారు.

# నాన్న కాదు.. రాక్షసుడు

**నాలుగేళ్ల కొడుకు గొంతు నులిమి.. కొరికి.. గుచ్చి కిరాతకంగా హత్య**
**భార్యకు దక్కకూడదనే దుశ్చర్య**





తండ్రి చేతిలో హత్యకు గురైన అక్షయ్.. మెడపై గాయాలు



నిందితుడు కనకయ్య

శాలిగౌరారం, న్యూస్‌టుడే: అభంశుభం తెలియని నాలుగేళ్ల బాలుణ్ని కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే గొంతు నులిమి, కొరికి, మెడపై పిన్నీసుతో గుచ్చి గాయపరిచి అత్యంత కర్కశంగా హత్య చేసిన దారుణ సంఘటన నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం తిర్మలరాయినిగూడెంలో గురువారం రాత్రి జరిగింది. శాలిగౌరారం సీఐ క్యాస్ట్రోరెడ్డి, ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం. . సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన చింతల కనకయ్య, స్వప్న దంపతులకు కుమార్తె అక్షిత(6), కుమారుడు అక్షయ్(4) ఉన్నారు. బతుకుతెరువు కోసం పిల్లలతో కలిసి వారు కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. నెల క్రితం భార్యభర్తల మధ్య ఘర్షణ జరగడంతో కనకయ్య కుమారుడు అక్షిత్‌ను తీసుకొని తిర్మలరాయినిగూడెంలోని తన పెదనాన్న చింతల రాములు ఇంటికి వచ్చేశాడు. రోజూ కూలి పనికి వెళ్తూ నెలరోజులుగా ఇక్కడే ఉంటున్నాడు. చిన్నారి అక్షయ్ బాగోగులు చూడటానికి ఇబ్బందిగా ఉందని.. వచ్చి బాలుణ్ని తీసుకెళితే బాగుంటుందని చింతల రాములు కుటుంబ సభ్యులు స్వప్నకు ఫోన్ చేసి చెప్పారు. ఆమె అంగీకరించి రెండుమూడు రోజుల్లో వచ్చి తీసుకెళ్తానని చెప్పింది. ఈ విషయం కనకయ్యకు తెలియటంతో ఆగ్రహానికి గురయ్యాడు. గురువారం బోనాల పండుగ కావడంతో రాత్రి మద్యం తాగి ఉన్మాదిలా మారి అర్ధరాత్రి దాటాక తన పక్కన నిద్రిస్తున్న కుమారుడు అక్షయ్‌ను గొంతు నులమడంతోపాటు శరీరంపై పలుచోట్ల కొరికి, మెడపై పిన్నీసుతో గుచ్చి గుచ్చి కిరాతకంగా హత్య చేశాడు. కొడుకు ఆమెకు దక్కకూడదనే దురుద్దేశంతోనే ఇలాంటి దారుణానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నట్లు సీఐ క్యాస్ట్రోరెడ్డి పేర్కొన్నారు.

## గతుకుల బొంత.. నిధుల చింత



హన్మకొండ ఎక్సైజ్‌కాలనీలోని ప్రధాన రహదారిది. అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తోంది. కిలోమీటరు దూరాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 3 కోట్లతో పనులు ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా కాలువల నిర్మాణం పూర్తి చేశారు. చివరగా తారు వేయాల్సిన సమయంలో నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారు మధ్యలోనే పనులు వదిలేశారు. ఇటీవల వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీనిపై రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – ఈనాడు, వరంగల్

# ఎలాంటి ఉల్లంఘనలూ లేవు

- 1,373 అభ్యంతరాలు స్వీకరించాం
- ఎన్నికలు నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం
- మున్సిపల్ ఎన్నికల ముందస్తు ప్రక్రియపై హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

ఈనాడు – హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికలకు ముందస్తు ప్రక్రియ అయిన వార్డుల విభజన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు, రిజర్వేషన్‌లు, ఓటర్ల జాబితా ప్రచురణ తదితరాల్లో నిబంధనలను ఎక్కడా ఉల్లంఘించలేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహించామని, ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యమిచ్చామని వివరించింది. వార్డుల విభజనపై 1,373 అభ్యంతరాలు రాగా 665 పరిష్కరించామని, మిగిలినవి చట్టప్రకారం పరిష్కరించలేనివని తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులను తొలగిస్తే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామంది. ఎన్నికల ముందస్తు ప్రక్రియను సింగిల్ జడ్జి తీర్పునకు విరుద్ధంగా హడావుడిగా చేపట్టారంటూ నిర్మల్ జిల్లాకు చెందిన కె.అంజుకుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇందులో హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ కౌంటరు దాఖలు చేశారు. కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, పంచాయతీల విలీనం తదితరాలన్నీ పూర్తయ్యాక జూన్ 21న ఎన్నికల ముందస్తు ప్రక్రియను ప్రారంభించామన్నారు. వార్డుల పునర్విభజన ప్రక్రియను జూన్ 30న ప్రారంభించి తుది ప్రచురణను జులై ఏడో తేదీన పూర్తి చేసినట్లు వివరించారు. వార్డుల పునర్విభజనలో ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యమివ్వడంతోపాటు ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారన్నారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను పత్రికల్లో ప్రకటన రూపంలో ఇచ్చామని, అభ్యంతరాలు తిరస్కరణకు గురైనవారు హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికల ప్రక్రియకు భంగం వాటిల్లిందన్నారు. ఎన్నికల ముందస్తు ప్రక్రియను చేపట్టామని, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

# పుర రిజర్వేషన్ల కసరత్తు పూర్తి

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదించనున్న ప్రభుత్వం
- కోర్టు తీర్పు వెలువడడమే తరువాయి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పురపాలక ఎన్నికల రిజర్వేషన్లపై కసరత్తు పూర్తయింది. కొత్త పురపాలక చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు కానుండగా దీనికి సంబంధించిన ప్రక్రియపై పురపాలకశాఖ అంతర్గత కసరత్తు దాదాపు పూర్తి చేసింది. వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ప్రచురణ కూడా జులై 16వ తేదీకి పూర్తయింది. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల శాతం వర్తించనుంది. గరిష్ఠంగా రిజర్వేషన్లు 50 శాతానికి పరిమితం కావడంతో అందులో ఎస్సీ, ఎస్టీలకు పోగా మిగిలిన శాతం బీసీలకు దక్కనుంది. మేయర్‌లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లకు రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ప్రాతిపదికగా రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. వార్డుల పునర్విభజనకు కోర్టు ఆమోదం తెలిపితే తీర్పు వెలువడిన ఒకటి రెండు రోజుల్లోనే రాష్ట్ర ఎన్నికల సంఘానికి పురపాలకశాఖ రిజర్వేషన్ల వివరాలు అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మరోపక్క ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధమైంది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించనున్నందున దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేసింది.

# ఆరోగ్య పథకానికి ఉద్యోగుల భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: ఆరోగ్య పథకం అమలులో ఆర్థికపరమైన అడ్డంకులను అధిగమించడానికి తమ వంతుగా భాగస్వాములమవుతామని ఉద్యోగ సంఘాలు వెల్లడించాయి. ఈ విషయమై గతంలో పలు సందర్భాల్లో వైద్య ఆరోగ్యశాఖకు వినతిపత్రాలు అందజేసిన ఉద్యోగ సంఘాల నేతలు శుక్రవారం సచివాలయంలో మరోసారి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిసి ఆర్థిక భాగస్వామ్యంపై తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు. నెలకు రూ.600-1000 వరకూ చెల్లించడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందున సంబంధిత దస్త్రాన్ని సీఎం వద్దకు పంపించినట్లు తెలిసింది. ఆయన నిర్ణయం అనంతరం తదుపరి కార్యాచరణ ఉంటుందని వైద్యవర్గాలు వెల్లడించాయి. గత రెండేళ్లుగా ఆరోగ్య పథకం(ఈజేహెచ్‌ఎస్) అమలులో ఆటంకాలను ఎదుర్కొంటోంది. ఆస్పత్రులకు బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో పథకం అమలుకు అడ్డంకిగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఉద్యోగులు ఆర్థిక భాగస్వామ్యాన్ని అందించడానికి ముందుకొచ్చినట్లు తెలుస్తోంది.

### నేడు టీషా భేటీ

ఉద్యోగులు, పింఛనుదారులు, పాత్రికేయుల పథకానికి ఏటా సుమారు రూ.300-400 కోట్ల వరకూ వ్యయమవుతోంది. గత నాలుగేళ్లలో పూర్తి స్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో సుమారు రూ.500 కోట్ల వరకూ ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన బకాయిలు సుమారు రూ. 1000 కోట్ల వరకూ ఉన్నాయనీ, మొత్తంగా రూ.1500 కోట్ల బకాయిలను తక్షణం చెల్లించకుంటే శనివారం నుంచి పూర్తిగా చికిత్సలను నిలిపివేస్తామని తెలంగాణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘం(టీషా) ఇప్పటికే ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓకు లేఖ ఇచ్చాయి. ఈ విషయమై చర్చించడానికి టీషా ప్రతినిధులు శనివారం భేటీ కానున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల సంకేతాలు అందకుంటే చికిత్సల నిలిపివేతకే మొగ్గు చూపుతామని టీషా ప్రతినిధి ఒకరు చెప్పారు. తమ బకాయిలనూ చెల్లించకపోతే ఈనెల 16 నుంచి తామూ అదే బాటలో నడుస్తామని ఆరోగ్యశ్రీ ట్రస్టు అనుసంధాన ఆసుపత్రులూ(తన్వా) ఐదు రోజుల కిందటే ట్రస్టు సీఈఓకు లేఖ అందించాయి. శనివారం తన్వా ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ఆందోళన చేపట్టడానికి ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం ఇప్పటికే రూ.300 కోట్లను ఆరోగ్యశ్రీ ట్రస్టుకు విడుదల చేసింది. ఈ నిధులను ప్రాధాన్యక్రమంలో ఆసుపత్రులకు విడుదల చేయనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

Admission Guidence for TS/UP/KS
MBBS/ VETERINARY
LOW SCORE / LOWEST PACKAGE
9515926206/8466963781

YVRAO-HYD
NEET
Long Term Batch Started
20 Students Batch - Ac
Super tips in PHY & CHEM
9100060601, 602




Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00